జోన్–3 కార్యాలయం ఆధునికీకరణ


జీవీఎంసీ జోన్–3 కార్యాలయంలో చేపడుతున్న విద్యుత్ వైరింగ్ పనులు


అమర్చిన విద్యుత్ లైన్లు

సీతంపేట: జీవీఎంసీ జోన్–3 కార్యాలయాన్ని సుమారు రూ.50 లక్షల వ్యయంతో ఆధునికీకరిస్తున్నారు. ఆశీలమెట్టలో జోన్–3 కార్యాలయం నిర్మించి సుమారు మూడు దశాబ్దాలు కావడంతో చాలా వరకు దెబ్బతింది. ఫ్లోరింగ్, విద్యుత్ వైరింగ్, పెయింట్లు పాడైపోయాయి. జోన్ పరిధిలో వివిధ వార్డుల నుంచి పనుల నిమిత్తం, పన్నుల చెల్లింపు, ఇంటి పన్ను మదింపు, ఇళ్ల నిర్మాణ ప్లాన్‌ల అనుమతి, శానిటేషన్ పనుల కోసం రోజూ కార్యాలయానికి ఎంతో మంది ప్రజలు వస్తుంటారు. వారికి సరైన సదుపాయాలు, నిరీక్షించడానికి వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని జోనల్ కార్యాలయాన్ని అభివృద్ధి చేయడానికి జీవీఎంసీ రూ.50 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో పట్టణ ప్రణాళిక కార్యాలయం, రెవెన్యూ విభాగం, ఇతర చాంబర్లను ఆధునికీకరిస్తున్నారు. పాడైన ఫ్లోరింగ్ తొలగించి కొత్తగా టైల్స్ వేస్తున్నారు. విద్యుత్ వైరింగ్, లైటింగ్, పెయింటింగ్, ఇతర మరమ్మతుల పనులు జరుగుతున్నాయి. రెండు నెలలుగా కొనసాగుతున్న ఈ పనులతో అధికారులు అందుబాటులో లేక జనం వెనుదిరుగుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వీలైనంత త్వరగా పనులు పూర్తిచేసి ప్రజలకు సేవలను అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

వెలగని వీధిలైట్లు.. అంధకారంలో రోడ్లు


మాధవధార వుడా కాలనీలో వెలగని వీధిలైట్లు


చీకటిలో వుడా కాలనీ రహదారి

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధార వుడా కాలనీ 48 లాస్ట్ బస్‌స్టాప్ రోడ్డు వద్ద వీధి లైటు కొంతకాలంగా వెలగడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ లైటే కాకుండా, ఆ రోడ్డు మొత్తం పైకి ఒక అర కిలోమీటర్ మేర చీకటిమయంగా ఉంటుంది. రోడ్డుకు చుట్టుపక్కల అపార్ట్‌మెంట్లు, షాపుల లైట్లు ఉండటంతో ఆ ప్రాంతంలో కొంత వెలుగు కనిపిస్తోంది. లేదంటే చిమ్మ చీకటే. ఆ రోడ్డు వద్దే 48 నంబర్ బస్ మలుపు తిరుగుతుంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోందని పాదచారులు, వాహన చోదకులు, కాలనీ వాసులు వాపోతున్నారు. రాత్రయితే చీకటిగా ఉండటంతో మహిళలు ఒంటరిగా అటువైపుగా వెళ్లడానికి భయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

సంపత్ వేంకటేశ్వరుడికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

కంచరపాలెం: గొల్లకంచరపాలెం కోదండ సీతారామ, ధనలక్ష్మిదేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ, అర్చకుల నేతృత్వంలో వెంకన్నకు సుప్రభాత సేవ, చక్రస్నానం చేశారు. తెల్లవారుజాము 6 గంటలకు శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ దంపతులు పంచామృతాభిషేకాలు, తులసీమాలార్చన, కుంకుమ పూజలు జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవుడికి సుప్రభాత సేవ


ఆలయ ప్రదక్షిణలో భక్తులు, అర్చకులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బందారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. వివరాలిలా.. అల్లూరి సీతారామరాజు జిల్లాకు జిల్లాకు చెందిన కిల్లో లచ్చన్న, కాకినాడకు చెందిన గరికిన మెషేక్ అనే ఇద్దరు యువకులు ఒడిశా నుంచి గంజాయి తీసుకువచ్చి ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డీఎల్‌బీ గ్రౌండ్ సమీపంలో సంచరిస్తున్నారు. అటువైపు వెళ్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు అనుమానాస్పదంగా తిరుగుతున్న వాద్దరినీ విచారించి, వారి బ్యాగ్‌లో తనిఖీ చేసి చూడగా రెండు కిలోలు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే యువకులను అదుపులోకి తీసుకొని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు.

నేత్ర పర్వం.. అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో స్వామివారి నిత్యకల్యాణాన్ని నేత్ర పర్వంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

విగ్రహాలకు ముసుగుల తొలగింపు

సీతమ్మధార: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాజకీయ నాయకుల విగ్రహాలకు వేసిన ముసుగులను తొలగించారు. సాధారణ ఎన్నికలు, కౌంటింగ్ పూర్తి కావడంతో ఉత్తర నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం ఈ చర్యలు చేపట్టారు. సీతమ్మధార, నక్కవానిపాలెం, సత్యం జంక్షన్, బాలయ్యశాస్త్రి లేఅవుట్, గురుద్వారా, అల్లూరి సీతారామరాజు జంక్షన్ తదితర ప్రాంతాల్లో విగ్రహాలకు రాజకీయ నాయకుల ఫొటోలకు వేసిన ముసుగులను తీసివేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లను తొలగించారు.


నక్కవానిపాలెంలో ముసుగులు తొలగించిన తర్వాత విగ్రహాలు

చురుగ్గా వాకింగ్ ట్రాక్ పనులు

మురళీనగర్: మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో ఆధునిక వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మట్టి, ఇసుకతో దీన్ని నిర్మించి వాకర్స్ నడకకు వారి ఆరోగ్యాన్ని వృద్ధి చేసేలా ట్రాక్ నిర్మిస్తున్నారు. ఇందుకోసం అవసరమైన మెటీరియల్‌ను తీసుకువచ్చారు. శనివారం ఈ పనులు నిర్వహించారు. పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఈ పనులను పర్యవేక్షించారు. ఈ నెల 11వ తేదీ వరకు పార్కు మూసివేసినందున 12వ తేదీ లోగా పనులు పూర్తి చేసి సందర్శకులు, వాకర్స్‌కు అందుబాటులోకి తెస్తామని ఆయన తెలిపారు.


వాకింగ్ ట్రాక్ పనులు పర్యవేక్షిస్తున్న వరప్రసాద్

సమ్మర్ టాలెంట్ షో అదుర్స్


వెస్ట్రన్ డ్యాన్స్‌తో అలరిస్తున్న చిన్నారులు


విజేతలతో నృత్య శిక్షకుడు అరుణ్ సాయి

సీతంపేట: సాయినాథ కళా సమితి ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయం నిర్వహించిన సమ్మర్ టాలెంట్ షో ఆద్యంతం అలరించింది. సుమారు 40 మంది చిన్నారులు పాల్గొని వెస్ట్రన్, క్లాసికల్ డ్యాన్సులతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కళా సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ అరుణ్ సాయికుమార్ మాట్లాడుతూ 24 ఏళ్లుగా ఆర్ అండ్ బీ వద్ద గల తమ సంస్థలో వెస్ట్రన్, క్లాసికల్, క్లాసికల్ మ్యూజిక్, మెడిటేషన్‌లో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఏటాలాగే ఈ సారికూడా వేసవి సంగీత నృత్య శిక్షణ శిబిరం నిర్వహించామన్నారు. నెల రోజుల పాటు శిక్షణలో నేర్చుకున్న అంశాలపై పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు, జ్ఞాపికలు, ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డ్యాన్సర్ రాజు, నాట్యాచారుడు లలిత్ కుమార్ గుప్తా, అతిథులు చల్లా మంజుల, సూర్యకళ పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపైనే వ్యాపారాలు


గురుద్వారా దరి ఫుట్‌పాత్ వద్ద పార్కింగ్

- ఇబ్బంది పడుతున్న పాదచారులు
- దృష్టి సారించని అధికారులు


గురుద్వారా జంక్షన్‌లో ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు

సీతమ్మధార: జీవీఎంసీ జోన్–3 పరిధిలో లక్షల రూపాయలు వెచ్చించి అందంగా నిర్మించిన ఫుట్‌పాత్‌లు వ్యాపారాలకు అడ్డాగా మారుతున్నాయి. ప్రజలు నడవడానికి వీలు లేని పరిస్థితి నెలకొంది. గురుద్వారా ప్రాంతంలో కొందరు చిరువ్యాపారులు ఫుట్‌పాత్‌లను ఇష్టారాజ్యంగా ఆక్రమించి తమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడంతో పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. గురుద్వారా, సీతమ్మధార, నక్కవానిపాలెం తదితర ప్రాంతాల్లోని ఫుట్‌పాత్‌లు, రోడ్లు ఆక్రమణకు గురవుతున్నాయి. కాలిబాటలపై ఉన్న ఫాస్ట్‌ఫుడ్, టీ, పాన్ షాపుల వద్ద వస్తున్న వారు తమ వాహనాలను అక్కడ పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

‘ఉత్తరాంధ్ర ఇన్‌చార్జిని సస్పెండ్ చేయండి’

డాబాగార్డెన్స్: కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి పోచారం రాకేష్‌రెడ్డి హద్దులు మీరుతున్నారని, ఆయనను తక్షణమే సస్పెండ్ చేయాలని ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి అంబటి కృష్ణ డిమాండ్ చేశారు. పార్టీ నాయకుల ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఓ హోటల్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఏఐసీసీ నాయకుడు మాణిక్యం ఠాకూర్, ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలను దూషించడం సరి కాదన్నారు. విలాసవంతమైన జీవితానికి అలవాటు పడిన రాకేష్‌రెడ్డి కార్యకర్తలను వేధిస్తున్నారని, విశాఖ సిటీ కార్యాలయం రీ మోడలింగ్ పేరిట లక్షలాది రూపాయలు వసూలు చేసి, ట్యాక్సులు కట్టాలని కొందరి నుంచి డబ్బులు వసూలు చేసి సొంత జేబు నింపుకున్నారని ఆరోపించారు. సమావేశంలో జమ్ము ఆదినారాయణ, హైదరాలి షింకా, ఉమ్మడి భాస్కరరావు, తెడ్డు రాంబాబు, టి.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో కొలువుదీరిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. అమ్మవారికి ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ కార్యనిర్వహణాధికారి పి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులరెడ్డి, సహాయ కార్యనిర్వహణాధికారులు కె.తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మేల్కోనకపోతే ముప్పే..!

- పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు
- డెంగ్యూ, మలేరియాలపై అప్రమత్తం
- జోన్–5లో హై రిస్క్ ఏరియాలుగా నాలుగు వార్డులు
- అదనపు సిబ్బంది నియామకంపై అధికారుల దృష్టి


ఫేషియల్ హాజరు నమోదు చేస్తున్న సిబ్బంది


ఎస్‌ఏడీలోని మలేరియా విభాగం భవనం

విశాఖ విద్య: జీవీఎంసీ జోన్–5 పరిధిలోని వార్డుల్లో సీజనల్ వ్యాధులు పొంచి ఉన్నాయి. పారిశ్రామిక ప్రాంత శివారు కాలనీల ప్రజలు ఎక్కువగా మలేరియా, డెంగ్యూ వాధుల బారిన పడుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి మే నెలఖారు వరకు జోన్ పరిధిలో 40 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. ఇప్పుడే ఇలా ఉంటే.. వర్షా కాలం మొదలైతే పరిస్థితి ఎలా ఉంటుందోనని ఈ ప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజువారీ కూలీ పనులు చేసుకునే వారు వైద్యం కోసమని పెద్దాస్పత్రులకు వెళ్లలేని పరిస్థితుల్లో స్థానిక వైద్య ఆరోగ్య సిబ్బంది, జీవీఎంసీ మలేరియా విభాగాన్ని అప్రమత్తం చేస్తేనే సీజనల్ వ్యాధుల బారి నుంచి బయటపడతామని స్థానికులు అంటున్నారు.

కోరలు చాస్తున్న డెంగ్యూ

పారిశ్రామ ప్రాంతంలోని శివారు కాలనీల్లో ఎక్కువగా డెంగ్యూ కేసులు నమోదవుతున్నాయి. డ్రైనేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోవడం, మురుగు నిల్వ ఉండటం వల్ల దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ కారణంగానే డెంగ్యూ వ్యాధి పీడితులు పెరుగుతున్నారు. ఇళ్ల ముందు నీటి గుంతలను ముందుగానే గుర్తించి, అలాంటి వాటిలో దోమల నివారణ చర్యలు చేపట్టాలి. సీజనల్ వ్యాధులకు అడ్డకట్ట వేసేలా జీవీఎంసీ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

హై రిస్క్ ఏరియాలో అప్రమత్తం

జ్ఞానాపురం కేంద్రంగా ఉన్న జోన్–5 కార్యాలయ పరిధిలో 24 వార్డులు ఉన్నాయి. కార్యక్రమాల పర్యవేక్షణలో భాగంగా రెండు విభాగాలుగా చేశారు. ఎస్‌ఏడీ కేంద్రంగా 17 వార్డులు, మల్కాపురం కేంద్రంగా 7 వార్డులపై పర్యవేక్షణ చేస్తూ, వ్యాధులకు అడ్డుకట్ట వేసేలా మలేరియా విభాగంలో సిబ్బందిని ఏర్పాటు చేశారు. జోనల్ కార్యాలయ వైద్యాధికారి ఆధ్వర్యంలో ఆయా విభాగాలకు మలేరియా ఇన్‌స్పెక్టర్లు సీజనల్ వ్యాధుల నివారణ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. వీరితో పాటు, ప్రతి వార్డులో ఒక హెల్త్ సూపర్‌వైజర్, మరో నలుగురు పీడీపీ సిబ్బంది పనిచేస్తున్నారు. 47, 48, 59, 60 వార్డుల పరిధిలో ఎక్కువగా డెంగ్యూ కేసులు నమోదవుతున్నాయి. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ వర్షా కాలంలో పనిచేసేలా 63 మంది సీజనల్ వర్కర్లను విధుల్లోకి తీసుకున్నారు. వీరిలో ఎస్‌ఏడీ కేంద్రంగా 40 మంది, మల్కాపురం కేంద్రంగా 20 మంది పని చేయనున్నారు. హై రిస్క్ ఏరియా అయినందున మరో 30 మందిని నియమించాల్సిన అవసరాన్ని ఇక్కడి అధికారులు జీవీఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

ఫేషియల్ హాజరుతో ఇక్కట్లు


52వ వార్డులో మురుగు నీటిని శుభ్రం చేస్తున్న సిబ్బంది

వార్డుల్లో పనిచేసే సిబ్బంది ప్రతి రోజూ తప్పనిసరిగా రెండు సార్లు ఫేషియల్ హాజరు నమోదు చేయాలని జోనల్ కార్యాలయ అధికారులు నిర్దేశించారు. ఇదికాస్తా రోజువారీ విధులకు అంతరాయం కలిగిస్తోందని సిబ్బంది అంటున్నారు. క్షేత్రస్థాయి పనితీరులో పారదర్శకత కోసమని ఇలాంటి చర్యలు చేపట్టాల్సిందే. వార్డుల్లో పనిచేసే సిబ్బంది అంతా ఎస్‌ఏడీ, లేదంటే అటు మల్కాపురం పాయింట్లకు వెళ్లి, ఉదయం, మధ్యాహ్నం వేళల్లో ఫేషియల్ హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. తాటిచెట్లపాలెం నుంచి ఎస్‌ఏడీ వరకు రోజుకు రెండు సార్లు వెళ్లి రావడంతోనే సగం సమయం అయిపోతుంది. వార్డుల పరిధిలోనే హెల్త్ సూపర్‌వైజర్లు సిబ్బంది పనిచేసే చోటకే వెళ్లి ఫేషియల్ హాజరు నమోదు చేసినట్లయితే కొంత మేర రోజు వారీ పనితీరులో పురోగతి కనిపిస్తోంది. ఆ దిశగా జీవీఎంసీ అధికారులు ఆలోచించాల్సిన అవసరం ఉంది.

సముద్రాలను కాపాడుకోవాలి


మాట్లాడుతున్న కృష్ణకుమారి

బీచ్‌రోడ్డు: మన సముద్రం మన వాతావరణం కోసం కృషి చెయ్యాలని యాక్షన్ ఎయిడ్ సంస్థ ఫెలోషిప్ ప్రతినిధి ఐ.కృష్ణ కుమారి కోరారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సం సందర్భంగా శనివారం సాయంత్రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడాది పొడవునా ప్రపంచ వ్యాప్తంగా మహా సముద్రాలను కాపాడుకోవాల్సిన రోజులే అని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. ఒక మహా సముద్రం, ఒకే వాతావరణం, ఒక్కటే మన భవిష్యత్తు అనే ఆలోచనతో సమష్టిగా కృషి చేయాలన్నారు. సమస్త మానవాళిని సముద్రాల పరిరక్షణకు చైతన్యవంతులను చేయాలని పిలుపునిచ్చారు. 2030 నాటికి సముద్ర ఆధారిత పరిశ్రమల ద్వారా 40 మిలియన్ల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి


సినీ గీతాలు ఆలపిస్తున్న గాయకులు

సీతంపేట: స్వర రాగం అండ్ మెలోడి ఫ్యూజన్ ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆహుతులను ఉర్రూతలూగించింది. సంస్థ వ్యవస్థాపకులు ఎస్.రమేష్, ఎస్.ఎన్.రావు ఆధ్వర్యంలో పలువురు గాయనీ గాయకులు పాత సినిమాల్లోని హిట్ సాంగ్స్ మధురంగా ఆలపించి అలరించారు. రెండు గంటల పాటు నిర్విరామంగా సాగిన సంగీత విభావరి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. అనంతరం అతిథుల చేతుల మీదుగా కళాకారులను సత్కరించారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

పెదగంట్యాడ: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పోటీలు దోహద పడతాయని రాష్ట్ర యాత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అండిబోయిన లక్ష్మి అన్నారు. ఏపీ స్టేట్ పవర్ లిఫ్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అండిబోయిన అప్పారావు, కార్యదర్శి మర్ల భాస్కరరావు ఆధ్వర్యంలో థర్డ్ ఏపీ స్టేట్ డెడ్లిఫ్ట్ చాంపియన్ షిప్–2024, ఫోర్త్ ఏపీ స్టేట్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్–2024, సిక్త్ ఏపీ స్టేట్ బ్రెంచ్ ప్రెస్ చాంపియన్ షిప్–2024 పోటీలను శనివారం ప్రారంభించారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని సీడబ్ల్యూసీలో రెండు రోజుల పాటు పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

సాగరతీర స్వచ్ఛతలో ఏయూ విద్యార్థులు


తీరంలో వ్యర్థాలను ఏరివేస్తున్న ఏయూ రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్, వలంటీర్లు

ఏయూక్యాంపస్: ప్రపంచ సముద్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు బీచ్ క్లీన్ కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఉదయం 6 గంటలకు ఆర్‌కే బీచ్ నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం 8 గంటలకు వైఎంసీఏ వద్ద ముగిసింది. కార్యక్రమాన్ని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ప్రారంభించారు. సమన్వయకర్త ఆచార్య పి.జానకీరామ్ తదితరులు ప్రసంగించారు. ఏయూ విద్యార్థులు, ఎన్‌సీసీఆర్, సీఎంఎఫ్ఆర్ఐ, సీఐఎఫ్‌టీ శాస్త్రవేత్తలు, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు 250 మందికిపైగా పాల్గొని బీచ్‌లో వ్యర్థాలను ఏరివేసి జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందికి అందజేశారు.